

**లోక్‌సభ ఎన్నికల పర్వం ముగిసింది.** ప్రజాతీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. అయితే, పెరిగిన పోలింగ్ శాతం ఏ పార్టీకి ప్రయోజనకరం అన్నది ఇప్పుడు ఉభయ జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది. 2019 ఎన్నికల్లో 68.10 శాతం పోలింగ్ నమోదు కాగా, తాజా సమరంలో 71.92 శాతం ఓటింగ్ నమోదైంది. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో పురుషుల కన్నా మహిళా ఓటర్లే అత్యధికంగా ఉన్నారు. వారు ఏ పార్టీ వైపు మొగ్గితే విజయం వారిదేనని విశ్లేషకులు చెబుతున్నారు. తొలి నుంచి కేసీఆర్‌కు మద్దతుగా నిలిచిన మహిళలు ఈసారి కూడా అండగా నిలబడ్డారని, విజయం తమదేనని బీఆర్ఎస్ నాయకులు పేర్కొంటున్నారు. అటు కాంగ్రెస్, బీజేపీ నేతలు సైతం గెలుపు తమదేనని చెబుతున్నారు.

- ఓట్ల లెక్కల్లో నిమగ్నమైన ప్రధాన పార్టీలు
- నిర్ణయాత్మకంగా మారిన మహిళా ఓటర్లు
- ఓటేసిన వారిలో మహిళలే అత్యధికం
- ప్రచారంలో దూసుకెళ్లిన బీఆర్ఎస్
- క్షేత్ర స్థాయిలో వెనుకబడిన బీజేపీ, కాంగ్రెస్

# గెలుపెవరిదో?

## గతం కన్నా మూడు శాతం పెరిగిన పోలింగ్





### మహిళల ఓట్లే కీలకం..

నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో సోమవారం జరిగిన పోలింగ్‌లో మహిళలే ఎక్కువగా పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అన్ని పోలింగ్ కేంద్రాల్లో మహిళా ఓటర్లు బారులు తీరారు. లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. నిజామాబాద్ లోక్‌సభ స్థానంలో మొత్తం 17,04,867 మంది ఓటర్లకు గాను 12,26,133 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో మహిళలే ఎక్కువగా ఉన్నారు. 6,73,629 మంది స్త్రీలు ఓటు వేయగా, 5,52,465 మంది పురుషులు, 39 మంది ఇతరులు ఓటేశారు. మగవారి కన్నా 1.21 లక్షల మంది స్త్రీలు అత్యధికంగా ఓటు వేయడం అభ్యర్థుల గెలుపోటములను నిర్దేశించనున్నది.

కంఠేశ్వర్, మే 14: సార్వత్రిక సమరం ముగిసింది. గెలుపెవరిదో అన్నది ఉత్కంఠగా మారింది. ఈసారి పెరిగిన పోలింగ్ శాతం ఏ పార్టీకి అనుకూలంగా ఉంటుంది. విజయం ఎవరిని వరిస్తుందన్న దానిపై సర్వత్రా చర్చ జరుగుతున్నది. 2019 ఎన్నికల్లో 68.10 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి 71.92 శాతం ఓటింగ్ నమోదైంది. గత ఎలక్షన్ల కన్నా ఈసారి మూడు శాతం పెరగడం బాగానే ఉన్నా అది ఎవరికి లాభిస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది. మొత్తం 29 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ, ప్రధానంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ నెలకొంది. నిన్నటిదాకా ఓట్ల వేటలో బిజీగా గడిపిన నాయకులు ఇప్పుడు విజయావకాశాలపై లెక్కలు వేసుకుంటున్నారు. పెరిగిన పోలింగ్ శాతం తమకే అనుకూలమని అభ్యర్థులు చెబుతున్నారు.

**వెనుకబడ్డ బీజేపీ, కాంగ్రెస్..**

అభ్యర్థుల ఖరారు నుంచి మొదలుకుని ప్రచారం వరకూ బీజేపీ, కాంగ్రెస్ వెనుకబడ్డాయి. బీజేపీ సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై ప్రజల్లోనే కాదు, పార్టీ శ్రేణుల్లోనూ వ్యతిరేకత వెల్లువెత్తింది. పసుపుబోర్డు విషయంలో తమను నమ్మించి వంచించారని రైతాంగంలో తీవ్ర ఆగ్రహం నెలకొంది. ఈ ప్రభావం తాజా ఎన్నికల్లోనూ కనిపించిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు, ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పైనా ప్రజల్లో వ్యతిరేకత నెలకొంది. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను నమ్మించిన హస్తం పార్టీ.. ఐదు నెలలు గడిచినా హామీల అమలులో విఫలమైంది. మరోవైపు, కరెంట్ కోతలు, ధాన్యం సేకరణలో ఇబ్బందులతో కాంగ్రెస్ సర్కారుపై రైతాంగం గుర్రుగా ఉన్నది. అధికార పార్టీపై నెలకొన్న వ్యతిరేకత తాజా ఎన్నికల్లో ప్రస్ఫుటమైందని చెబుతున్నారు.

**గెలుపుపై బీఆర్ఎస్ ధీమా..**

దాదాపు నెలన్నర పాటు సాగిన ఎన్నికల పర్వంలో బీఆర్ఎస్ ముందువరుసలో నిలిచింది. అభ్యర్థి ఖరారు నుంచి మొదలుకుని ప్రచార పర్వం, పోల్ మేనేజ్‌మెంట్ వరకూ అన్ని అంశాల్లోనూ ప్రణాళికాబద్ధంగా వ్యవహరించింది. క్షేత్ర స్థాయిలో పటిష్టమైన కేడర్ ఉండడం, బలమైన అభ్యర్థిని బరిలో నిలపడం గులాబీ పార్టీకి సానుకూలంగా మారింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన నాటి నుంచే బాజిరెడ్డి గోవర్ధన్ ఎన్నికల సమరంలోకి దూకారు. ప్రత్యర్థుల కన్నా ముందే ప్రచారం ప్రారంభించిన ఆయన.. ఏడు సెగ్మెంట్లను చుట్టేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో డీలా పడిన శ్రేణుల్లో.. పార్టీ అధినేత కేసీఆర్ పర్యటన కొత్త జోష్‌ను తెచ్చింది. దీంతో కేడర్ మరింత ఉత్సాహంతో పని చేయడం ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కలిసొచ్చింది. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పార్టీ విజయం కోసం తీవ్రంగా శ్రమించారు. పెరిగిన ఓటింగ్ శాతం తమకే అనుకూలమని బీఆర్ఎస్ నేతలు ఘంటాపథంగా చెబుతున్నారు.



## నేను పక్కా లోకల్..



చాయ్ తాగుతూ సేదతీరుతున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ టౌన్, మే 14: ఎప్పుడైనా తాను, తన కుటుంబం పక్కా లోకల్ అని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బిజీ బిజీగా గడిపిన పోచారం మంగళవారం ఉదయం బాన్సువాడ పాత మున్సిపల్ కార్యాలయం కాంప్లెక్స్‌లోని ఇమ్రాన్ టీ పాయింట్ వద్ద స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి చాయ్ తాగారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన పలువురితో ముచ్చటిస్తూ ఎన్నికలు వస్తాయి పోతాయి, నాన్ లోకల్ నాయకులు ఓట్ల కోసం వస్తారు.. పోతారు కానీ కలకాలం బాన్సువాడ ప్రజలతో కలిసి ఉండేది తానేనని, తాను పుట్టింది బాన్సువాడలోనే, ఇక్కడి ప్రజలే తన కుటుంబమని తెలిపారు. ఎన్నికలు ఉన్నా లేకపోయినా బాన్సువాడ ప్రజలతో అనునిత్యం కలిసి జీవిస్తానని అన్నారు. అక్కడే మామిడి పండ్లు అమ్ముతున్న ఒక పెద్దావిడా వచ్చి పోచారం పటేలా నా సొంత చెట్టుకు కాసిన పండ్లు మీరు తినండి అంటూ ఇవ్వడంతో పోచారం సంతోషం వ్యక్తంచేశారు. పోచారం వెంట మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, బాన్సువాడ సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు ఎజాస్, వాహెబ్, నార్ల రవీందర్, ఉదయ్ తదితరులు ఉన్నారు.

## భారీ మెజార్టీతో గెలుస్తున్నాం..

బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సారంగాపూర్, మే 14: ఎంపీగా తాను భారీ మెజార్టీతో విజయం సాధించబోతున్నట్లు బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ధీమా వ్యక్తంచేశారు. నిజామాబాద్‌లోని తన నివాస ప్రాంగణంలో రూరల్ నియోజకవర్గంలోని నిజామాబాద్, మోపాల్, డిచ్‌పల్లి, ధర్పల్లి, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి, సిరికొండ మండలాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ ఎలా జరిగిందన్న విషయమై బాజిరెడ్డి గోవర్ధన్ మండలాల వారీగా సమీక్షించారు. గ్రామాల వారీగా ఓట్ల వివరాలతోపాటు తమకు అనుకూలంగా పోలైన ఓట్ల అంచనా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాజిరెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు రాత్రింబవళ్లు శ్రమించి తన విజయసాధన కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారన్నారు. బీఆర్ఎస్ శ్రేణులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అబద్ధపు మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను అమలుపర్చడంలో పూర్తిగా విఫలమైందన్న విషయాలను ఇంటింటా వెళ్లి ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయడంలో బీఆర్ఎస్ శ్రేణులు సఫలీకృతులయ్యారని తెలిపారు. బస్సు యాత్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారని, ఫలితంగా బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపిందన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ శ్రేణులందరికీ ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో కొందరు నాయకులు స్వార్థంతో కాంగ్రెస్, బీజేపీలోకి వెళ్లడం సరికాదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఈగ సంజీవ్‌రెడ్డి, బాజిరెడ్డి జగన్, మీసాల మధుకర్‌రావు, బొల్లెంక గోపాల్‌రెడ్డి, ప్రేమ్‌దాస్, అన్నం సాయిలు, శ్రీనివాస్‌రావు, ముత్యంరెడ్డి, రాము, శక్కరికొండ కృష్ణ, దాసరి లక్ష్మీనర్సయ్య, హన్మంత్‌రెడ్డి, రమేశ్‌నాయక్, కుంచాల రాజు, నట్ట భోజన్న పాల్గొన్నారు.

## లెక్క తేలింది..

- నిజామాబాద్‌లో 71.92శాతం పోలింగ్ నమోదు
- ఓటేసిన 12,26,133 మంది

కంఠేశ్వర్/ కామారెడ్డి, మే14: నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి నిర్వహించిన ఎన్నికల్లో 71.92శాతం పోలింగ్ నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు మంగళవారం తెలిపారు. మొత్తం 17,04,867 ఓటర్లకు 12,26,133 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు. ఓటింగ్‌లో పాల్గొన్న వారిలో మహిళా ఓటర్ల సంఖ్య 6,73,629 ఉండగా, పురుష ఓటర్లు 5,52,465 మంది, ఇతరులు 39 మంది ఓటు వేశారని అన్నారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని అయా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలైన ఓటింగ్ ఇలా ఉన్నది.

నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో..

| అసెంబ్లీ నియోజకవర్గం | మొత్తం ఓటు | పోలైన ఓట్లు | ఓట్ల శాతం |
|---|---|---|---|
| ఆర్మూర్ | 212145 | 155159 | 73.14% |
| బోధన్ | 223096 | 166330 | 74.56% |
| నిజామాబాద్ అర్బన్ | 304317 | 188159 | 61.83% |
| నిజామాబాద్ రూరల్ | 256593 | 191252 | 74.54% |
| బాల్కొండ | 226792 | 169524 | 74.75% |
| కోరుట్ల | 245249 | 180867 | 73.75% |
| జగిత్యాల | 236675 | 174842 | 73.87% |
| మొత్తం | 1704867 | 1226133 | 71.92% |

కామారెడ్డి జిల్లా పరిధిలో..

| అసెంబ్లీ నియోజకవర్గం | మొత్తం ఓట్లు | పోలైన ఓటు | ఓట్ల శాతం |
|---|---|---|---|
| కామారెడ్డి | 2,55,007 | 1,82,325 | 71.50% |
| జుక్కల్ | 2,02,887 | 1,53,855 | 75.83% |
| ఎల్లారెడ్డి | 2,23,027 | 1,72,928 | 77.54% |
| బాన్సువాడ | 1,96,826 | 1,51,516 | 76.98 % |



## సంగారెడ్డికి ఈవీఎంలు

- గీతం యూనివర్సిటీ స్ట్రాంగ్ రూంలో భద్రం
- పోలీస్ బందోబస్తుతో తరలింపు

**జహీరాబాద్ పార్లమెంట్** పరిధిలోని ఎల్లారెడ్డి నియోజకవర్గ ఈవీఎంలను సంగారెడ్డి జిల్లాకు భారీ బందోబస్తు మధ్య తరలించారు. మంగళవారం తెల్లవారుజామున డీఎస్పీ శ్రీనివాస్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈవీఎంలను కంటైనర్‌లో సంగారెడ్డి జిల్లాలోని గీతం యూనివర్సిటీకి పంపారు. యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో ఈవీఎంలను భద్రపరిచారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో మొత్తం 2,23,027 మంది ఓటర్లు ఉండగా 270 పోలింగ్ కేంద్రాల్లో 1,72,929 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు

-ఎల్లారెడ్డి రూరల్, మే 14

పరిశీలకులు, ఏజెంట్ల సమక్షంలో సీల్




స్ట్రాంగ్‌రూమ్ వద్ద పహారాలో ఉన్న పోలీసు

## స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఈవీఎంలు

కంఠేశ్వర్, మే 14: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను ఓట్ల లెక్కింపు కేంద్రమైన డిచ్‌పల్లి సీఎంసీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చారు. నియోజకవర్గాల వారీగా క్రమపద్ధతిలో అమర్చారు. మంగళవారం ఉదయం ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలీస్ వజ్ ఆర్‌తోపాటు అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్ వేశారు. రిటర్నింగ్ అధికారి,కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్‌లు ఈవీఎంల భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్ట్రాంగ్ రూంలతోపాటు వాటి పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాలను అమర్చారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులోకి తెస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ప్రతి కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, సీపీ అధికారులకు సూచనలు చేశారు. జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వారి వెంట ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.



స్ట్రాంగ్‌రూమ్‌లోని ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్, పార్టీల ప్రతినిధులు